మెరుగైన విద్యనందించాలి

• పార్వతీపురం ఐటీడీఏ డీడీ శ్రీనివాసరావు

గుమ్మలక్ష్మీపురం: విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలు పెంపొందేలా మెరుగైన విద్యనందివ్వాలని పార్వతీపురం ఐటీడీఏ డిప్యూటీ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని టిక్కబాయి గిరిజన సంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలను, గుమ్మలక్ష్మీపురంలోని డిగ్రీ, జూనియర్ కళాశాలల వసతిగృహాన్ని, భద్రగిరిలోని ఏపీటీడబ్ల్యూఆర్ బాయ్స్ జూనియర్ కళాశాల, ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ జూనియర్ కళాశాల (పీటీజీ)తో పాటు ఏపీటీడబ్ల్యూఆర్ గరల్స్ స్కూల్ (పీటీజీ)ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆయా విద్యా సంస్థల్లో ప్రిన్సిపాళ్లు, సంక్షేమాధికారులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బందితో సమావేశం నిర్వహిస్తూ గిరిజన విద్యార్థులకు విద్యా సామర్థ్యాలు మెరుగుపడేలా విద్యాబోధన అందించేందుకు కృషి చేయాలన్నారు. పాఠ్యపుస్తకాల జ్ఞానంతో పాటు ఆధునిక సమాజం యొక్క పరిజ్ఞానంపై కూడా అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని, మెనూ అమలుపర్చాలని, మానసిక ఉల్లాసం కోసం యోగా, క్రీడలు నిర్వహించాలంటూ సూచించారు. ఆయా విద్యా సంస్థల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా రెసిడెన్షియల్ కళాశాల, పాఠశాలల్లో ఖాళీగా ఉన్న సబ్జెక్టు లెక్చరర్లు, ఉపాధ్యాయుల విషయంపై స్పందించిన డీడీ పక్క కళాశాలలు, పాఠశాలల నుంచి సర్దుబాటు చేస్తామన్నారు. శిథిలావస్థలో ఉన్న తరగతి గదులను పరిశీలించి, మరమ్మతు పనుల కోసం ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను సద్వినియోగించుకుంటూ చదువులో ఉన్నతంగా రాణించాలని అన్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలకు పెండింగ్‌లో ఉన్న బిల్లులు, విద్యార్థులకు ఇవ్వాల్సిన కాస్మొటిక్ చార్జీలు మంజూరయ్యేలా ఉన్నతాధికారులు కృషి చేస్తున్నట్లు చెప్పారు.


భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ బాలికల స్కూల్‌లో ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డీడీ శ్రీనివాసరావు

పొత్తుల సంగతి ప్రజలే తేలుస్తారు...

• ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి


ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి

వీరఘట్టం: రాష్ట్రంలో టీడీపీ, జనసేన పార్టీల పొత్తులపై ప్రజలు దుమ్మెత్తిపోస్తున్నారని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి అన్నారు. వండవ క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కళావతి విలేకర్లతో గురువారం మాట్లాడారు. 2014 నుండి 2018 మధ్యకాలంలో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, టీడీపీ నేత నారా లోకేష్ తమ సభలలో ఒకరిపై ఒకరి ఇష్టానుసారంగా తిట్టుకున్నారని గుర్తు చేశారు. తర్వాత 2019లో వచ్చిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ చేతిలో చిత్తుగా ఓడిపోయిన తర్వాత టీడీపీ, జనసేన దోస్తీ కట్టారని, మళ్లీ ఇప్పుడు టీడీపీతో పొత్తుపెట్టుకుంటున్నట్లు పవన్ కళ్యాణ్ ప్రకటించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేయడం తప్పు అని వాదిస్తున్నారే తప్ప ఆయన చేసిన స్కిల్ స్కామ్‌పై జనసేన అధినేత పవన్ ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. చట్టం వీళ్లకు ఏమైనా చుట్టమా...చట్టం దృష్టిలో అందరూ సమానమే... తప్పు చేస్తే ఎంతటి వారికైనా శిక్ష తప్పదని అన్నారు. వీరి పొత్తులను ప్రజలు చిత్తు చేసే రోజులు దగ్గరలోనే ఉన్నాయని, 2024 తర్వాత టీడీపీ, జనసేన అడ్రస్‌లు గల్లంతవ్వడం ఖాయమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కళావతి అన్నారు.

సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలి

పాలకొండ: సచివాలయ సిబ్బంది పనితీరు మార్చుకోవాలని డీఎల్‌డీఓ వివి.గోపాలకృష్ణ హెచ్చరించారు. మండలంలోని నవగాం సచివాలయాన్ని ఆయన గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ సిబ్బంది పనితీరు పరిశీలించి అసంతృప్తిని వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఉన్నత ఆశయంతో సచివాలయాలను ఏర్పాటు చేసిందని, ప్రజలకు సేవలు సకాలంలో అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని స్పష్టం చేశారు. విధులకు సక్రమంగా హాజరు కావడంతో పాటు సిటిజన్ చార్టు ప్రకారం సేవలు అందించాలని తెలిపారు.


సచివాలయంలో సిబ్బందిని హెచ్చరిస్తున్న డీఎల్‌డీఓ

గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల

పాలకొండ రూరల్: గ్రంథాలయ పితామహుడు గాడిచర్ల హరిసర్వోత్తమ రావు జయంతి కార్యక్రమాలను గురువారం పాలకొండ శాఖ గ్రంథాలయంలో నిర్వహించారు. తొలిత గాడిచర్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన గ్రంథపాలకుడు బి.గణేష్‌బాబు మాట్లాడుతూ 1906లో విజ్ఞానచంద్రికా గ్రంథ మండలి నిర్వహణకు అందించిన తోడ్పాటును వివరించారు. వందేమాతరం ఉద్యమం, జాతీయ ఉద్యమంలో ఆయన సేవలు కొనియాడారు. 1934లో ఏపీ గ్రంథాలయ సంఘానికి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి వయోజన విద్యా కేంద్రాలను స్థాపించిన మొట్టమొదటి వ్యక్తి గాడిచర్ల అని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ పాఠకులు, సచివాలయ సిబ్బంది కె.శివకుమార్, పురుషోత్తమరావు, భాస్కరరావు, మధుసూదనరావు, ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


గాడిచర్లకు నివాళులర్పిస్తున్న గ్రంథాలయ, సచివాలయ సిబ్బంది, పాఠకులు

గిరిజన విద్యార్థుల కోసం...

గుమ్మలక్ష్మీపురం: తన స్నేహితుడిచ్చిన ఆర్థిక సాయంతో గుమ్మలక్ష్మీపురం మండలంలోని భద్రగిరి ఏపీటీడబ్ల్యూఆర్ జూనియర్ కళాశాల(బాయ్స్)లో కనీస వసతులు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ యుగంధర్ తెలిపారు. ఇటీవల తన పుట్టిన రోజు సందర్భంగా విష్ చేసిన తన స్నేహితుడు కామేష్ ఏం చేయాలని అడుగగా.. కళాశాలలోని గిరిజన విద్యార్థులకు సౌకర్యాలు కల్పించేందుకు ప్రోత్సాహం అందివ్వాలని కోరగా.. తక్షణమే రూ.25వేలు ఆర్థిక సాయాన్ని అందించారని, ఆ సాయంతో కళాశాలలోని మరుగుదొడ్లు, ఆర్వో ప్లాంట్, వాష్ బేషిన్ల వద్ద పాడైపోయిన ట్యాప్‌లన్నింటిని తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తరగతి గదుల్లో మెరుగైన విద్యుత్ బల్బులను అమర్చామన్నారు. మరుగుదొడ్లలో పాడైన డోర్లు, ప్రధాన గేట్‌లను కూడా మరమ్మతు చేయించినట్టు తెలిపారు.


జూనియర్ కళాశాలలో వాష్‌బేసిన్ల వద్ద ఏర్పాటు చేసిన కొత్త ట్యాపులు

పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు పరిశీలించండి

వీరఘట్టం: మండల వ్యాప్తంగా ఉన్న అన్ని పోలింగ్ బూత్‌ల్లో మౌలిక వసతులు ఉన్నాయా.. లేదా.. అని పరిశీలించాలని తహసీల్దార్ చందక సత్యనారాయణ సూచించారు. బీఎల్‌ఓలతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ కేంద్రం వద్ద పోలింగ్ బూత్ నెంబర్ ఉండేలా చూడాలన్నారు. ప్రతీ కేంద్రం వద్ద పోలింగ్ బూత్ వివరాలు నమోదు చేయాలని సూచించారు. ఓటర్ల జాబితాల్లో తప్పులు లేకుండా చూడాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ సత్యనారాయణ

ఉల్లాసంగా... ఉత్సాహంగా..


గెలుపొందిన క్రీడాకారులతో ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు

పాలకొండ రూరల్: చదువులతో పాటు క్రీడల్లో సత్తా చాటాలని ఎం.సింగుపురం సర్పంచ్ రణస్థలం రామా రాంబాబు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో గురువారం నిర్వహించిన ప్రభుత్వ పాఠశాల క్రీడా సమాఖ్య ఆటల పోటీలను సర్పంచ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో నాలుగు మండలాలకు చెందిన 20 పాఠశాలల నుంచి అండర్ -14, 17 విభాగాలకు నిర్వహించిన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, త్రోబాల్, పరుగు పందేల్లో బాల, బాలికలు తమ ప్రతిభ కనపర్చారు. హెచ్‌ఎం బి.సంఘమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పక్కాగా 'జగనన్న ఆరోగ్య సురక్ష'

పాలకొండ: ప్రభుత్వం చేపడుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం సక్రమంగా చేపట్టాలని అన్నవరం పీహెచ్‌సీ వైద్యాధికారి కమలనాథ్ అన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో వైద్య సిబ్బందితో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 15 నుంచి గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి సర్వే చేయాలన్నారు. ఈ నెల 30 నుంచి గ్రామాల వారీగా ఆరోగ్య సురక్షక్ష శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. శిబిరాలు నిర్వహించే నాటికి గ్రామంలో ఉన్న ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు సిద్ధం చేయాలని తెలిపారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు

సీతానగరం: మండల కేంద్రంలో సువర్ణముఖి నదీతీరాన గల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో స్వామికి గురువారం ఆలయ ప్రధానఅర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చకులు భక్తులతో ప్రత్యేక పూజలు చేయించారు. స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు భక్తిశ్రద్ధలతో క్యూలో ఉండి పూజల్లో పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషాదివస్


నిడగల్లులో విద్యార్థులు వేసిన 'హిందీ' అక్షర మాలిక

సీతానగరం: విద్యార్థులంతా హిందీ భాష ప్రాముఖ్యతను తెలుసుకుని గ్రామాల్లో అందరికీ తెలియజేయాలని నిడగల్లు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఎం.శివున్నాయుడు కోరారు. ఈ మేరకు గురువారం జాతీయ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిడగల్లు ఉన్నత పాఠశాల హిందీ టీచరు ఎం.గోపీనాథ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వం, వ్యాసరచన పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలను, విద్యార్థులతో హిందీ అక్షర మాలికను వేయించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శివున్నాయుడు హిందీ భాష విశిష్టతను వివరిస్తూ హిందీభాషను అలవర్చుకున్న వారు భారతదేశంలోనే కాకుండా ఇతర దేశాల్లో విషయాలను తెలుసుకుని ప్రయాణం సులువుగా చేయవచ్చన్నారు. హిందీ టీచర్ గోపీనాథ్ మాట్లాడుతూ విద్యార్థులంతా తెలుగు, ఇంగ్లీష్, హిందీ భాషలను నేర్చుకుని దేశంలో ఎక్కడైనా ఉపాధి అవకాశాలు పొందడానికి సులభతర మవుతుందన్నారు. అనంతరం హిందీ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన పోటీలలో విజేతలకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.

క్లుప్తంగా

సొంత విత్తనాలతో బహుళ ప్రయోజనాలు


మాట్లాడుతున్న ఏడీ శారదదేవి

భామిని: రైతులు తమకు కావాల్సిన విత్తనాలను సొంతంగా తయారు చేసుకోవడం ద్వారా బహుళ ప్రయోజనాలు పొందవచ్చని పార్వతీపురం మన్యం జిల్లా వనరుల కేంద్రం(డీఆర్‌సీ) సహాయ సంచాలకులు బి.శారదదేవి, కె.శ్రీనివాస్ అన్నారు. సాలికిరి ఆర్‌బీకేలో గురువారం నిర్వహించిన రైతు శిక్షణ కేంద్రంలో రైతులకు పలు సూచనలు చేశారు. ఇప్పటికే అందించిన ఫౌండేషన్ సీడ్‌తో పంటల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ, కేళీల నివారణ, గాలిబాటలతో ప్రయోజనాలు వివరించారు. గురండి, ఘనసరలో గ్రామీణ విత్తనోత్పత్తి పథకంలో రైతులకు శిక్షణ ఇచ్చారు. అనంతరం ఫౌండేషన్ సీడ్ వేసిన పొలాలను సందర్శించి సస్యరక్షణ చర్యలు వివరించారు. వ్యవసాయాధికారులు కిమిడి మన్మధరావు, కొర్ను సింహాచలం, ఏఏలు జ్యోతి, ఈశ్వరరావు, గొర్లె ఎలీసా, రైతుమిత్రలు ఉన్నారు.

పదోన్నతి పొందిన ఎంఈఓకు సన్మానం


వీరఘట్టం ఎంఈఓ ఆనందరావును సన్మానిస్తున్న ఎంఈఓ, హెచ్‌ఎంలు

భామిని: పెద్దదిమిలి జెడ్పీహెచ్ స్కూల్ హెచ్‌ఎంగా పని చేస్తున్న రాగోలు ఆనందరావు ఎంఈఓగా పదొన్నతి పొంది వీరఘట్టం బదిలీ కావడంతో ఆయనను భామిని ఎంఈఓ ఎ.శ్రీనివాస్ ఆధ్వర్యంలో గురువారం సన్మానం చేశారు. బత్తిలి, బాలేరు, భామిని, పెద్దదిమిలి హెచ్‌ఎంల ఆధ్వర్యంలో దుశ్శాలువలతో సన్మానించారు. సీఆర్‌పీ కిశోర్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బదిలీ సిబ్బందికి ఘన సన్మానం


బదిలీపై వెళ్తున్న సిబ్బందిని సన్మానిస్తున్న ఉపాధి సిబ్బంది

కురుపాం: మండలంలోని జాతీయ ఉపాధి హామీ పథకంలో విధులు నిర్వహించి బదిలీపై విజయనగరం జిల్లాకు వెళ్తున్న టెక్నికల్ అసిస్టెంట్లు పి.లింగరాజు, ఎం.నారాయణరావులకు ఆ పథకం ఏపీఓ బావాజీ ఆధ్వర్యంలో సంబంధిత కార్యాలయంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్తున్న సిబ్బందిని ఉద్దేశించి ఏపీఓ మాట్లాడుతూ విధి నిర్వహణలో మంచి సేవలను అందించారన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది జేఈ, టీఏ, సీఓలు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు భూముల పరిశీలన

సీతానగరం: మండలంలోని అప్పయ్యపేట సమీపంలో ఉన్న శ్రీ సత్య రా అండ్ బాయిల్డ్ రైస్ మిల్లుకు సంబంధించిన భూములను రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలత గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ రైస్‌మిల్ నెలకొల్పే సమయంలో కొనుగోలు చేసిన భూములను ఇండస్ట్రియల్‌కు అనుసంధానం చేయాలని నిర్వాహకులు దరఖాస్తు చేసు కోవడంతో రికార్డుల ప్రాప్తిగా భూమిని తనిఖీ చేసి నివేదిక తయారు చేయనున్నామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్వీ రమణ, మండల సర్వేయర్ శంకరరావు, ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు,వీఆర్వోలు పి.కుమార్ నాయుడు, ఎం.సింహాచలం, రైస్ మిల్లు యజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

గిరిజన యువకుడికి ఆర్థిక సాయం

కురుపాం: మండల కేంద్రంలోని మంతినివలస గిరిజన గ్రామానికి చెందిన కాకుల ప్రశాంత్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ శ్రీకాకుళం జెమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. రూ.లక్షల్లో డబ్బులు అవసరం కావడంతో స్థానిక కురుపాం డైలీ న్యూస్ వాట్సాప్ గ్రూప్‌లో ప్రశాంత్ ఆరోగ్యంపై పోస్టు పెట్టగా గ్రూప్‌లో ఉన్న సభ్యులు తమ వంతు సాయంగా నగదు రూ.24 వేలు సమకూర్చి సంబంధిత కుటుంబ సభ్యులకు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా గ్రూప్ సభ్యులు పొట్నూరు రవికుమార్, కొత్తకోట రవికుమార్, బరాటం చంద్రమౌళి, గుంప స్వామి, గొడు గోపాలరావు మాట్లాడుతూ ఆరోగ్య సమస్య పరిష్కారానికి తమ వంతు సాయం ఎప్పుడైనా అందిస్తామని తెలిపారు. వాట్సాప్ గ్రూపు సభ్యులకు పలువురు అభినందించారు.


ప్రశాంత్ కుటుంబ సభ్యులకు నగదును అందజేస్తున్న వాట్సాప్ గ్రూప్ సభ్యులు

ఘనంగా శిలువ దేవాలయ వార్షికోత్సవం

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో ఉన్న పరిశుద్ధ శిలువ దేవాలయం 25వ వార్షికోత్సవం గురువారం సవర కోటపాడు విచారణ గురువు, ఫాదర్ ఛార్లెస్, కతోలిక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బత్తిలి విచారణ గురువు రెవరెన్ ఫాదర్ థోమస్ రెడ్డి హాజరై పాపాన్ని వదిలి ప్రేమ, శాంతి, సమాధానాలతో ప్రజలు జీవించాలని దైవ సందేశాన్ని అందించారు. మహోత్సవ కార్యక్రమానికి గుమ్మలక్ష్మీపురం, ఎల్విన్‌పేట, సవర కోటపాడు, లక్కగూడ, కొండవారిగూడ, పి.లేవిడి తదితర గ్రామాల నుంచి వందలాది మంది క్రైస్తవ భక్తులు హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.


పరిశుద్ధ శిలువ దేవాలయంలో ప్రసంగిస్తున్న ఫాదర్లు

పండుగలా కొత్త పింఛన్ల పంపిణీ


కొమరాడ: రాజ్యలక్ష్మీపురంలో కొత్త పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు


కురుపాం: పాడి పంచాయతీలో కొత్తగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్, సచివాలయ ఉద్యోగులు


జియ్యమ్మవలస: గవరమ్మపేటలో పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ తదితరులు


భామిని: లబ్ధిదారులకు పింఛన్ అందజేస్తున్న బత్తిలి సర్పంచ్


కురుపాం: మొండెంఖల్ పంచాయతీలో మంజూరైన పింఛన్లను అందజేస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

కురుపాం: కొత్తగా మంజూరైన పింఛన్లను అన్ని చోట్ల పండుగలా పంపిణీ చేస్తున్నారు. వీటిని అందుకుంటున్న లబ్ధిదారులు సంబరపడుతున్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొంటున్నారు. తమ కష్ట కాలంలో పింఛన్లు మంజూరు చేసి తమ కుటుంబాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేస్తున్నారు. – సాక్షి నెట్‌వర్క్

ఘనంగా హిందీ దివస్

హిందీ దివస్‌ను గురువారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ జాతీయ భాష హిందీ పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్


పాలకొండ: హిందీ ఉపాధ్యాయుడును సన్మానిస్తున్న విద్యార్థులు


వీరఘట్టం: హిందీ వర్ణమాలలో మొదటి అక్షరంలా కూర్చున్న తలవరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు


వీరఘట్టం: తలవరం హైస్కూల్‌లో హిందీ ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, సహచర ఉపాధ్యాయులు


జియ్యమ్మవలస: చినమేరంగి ఉన్నత పాఠశాలలో నృత్యం చేస్తున్న విద్యార్థులు


జియ్యమ్మవలస: వనజ గిరిజన ఆశ్రమ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడుకు సన్మానం


సీతంపేట: హిందీ అ, ఆ ఆకారంలో విద్యార్థినులు


పాలకొండ రూరల్: హిందీ ఉపాధ్యాయిని వనజను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు